

హైదరాబాద్ వార్త

# నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

-అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
-జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఓటింగ్
-250 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు
-పోలింగ్ కేంద్రం చుట్టూ వందమీటర్ల వరకు 144 సెక్షన్
-ఈనెల 25న ఓట్ల లెక్కింపు



**హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త:** హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిట ర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఈమేరకు మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకటి కార్పొరేటర్లకు, మరొకటి ఎక్స్ ఆఫీషియో సభ్యులకు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారని బుధవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితో పాటు మరికొంత మంది సిబ్బందిని రిజర్వ్ లో పెట్టామని చెప్పారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారని, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. సుమారు 200 నుండి 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. దాదాపు 500 మంది అధికారులు, సిబ్బంది ఎలక్షన్ డ్యూటీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు మినహా జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో పనిచేసే మిగతా ఉద్యోగులకు 23న సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. అట్టి ఉద్యోగులందరూ జూన్ నెల రెండో శనివారం కార్యాయ విధులకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రవి, పాల్గొన్నారు.

**పార్టీల బలాబలాలు..**

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం, బీజేపీ పార్టీలు పోటీలో ఉన్నాయి. ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హాసన్, బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు బరిలో ఉన్నారు. హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా హైదరాబాద్ జిల్లాకు చెందిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో మెంబర్స్‌గా జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈఎన్నికలో మొత్తం ఓటర్లు 112 మంది ఓటర్లు ఉండగా కార్పొరేటర్లు 81,ఎక్స్ ఆఫీషియో సభ్యులు 31 మంది ఓటు వేయనున్నారు. ఎంఐఎం పార్టీకి 41 కార్పొరేటర్లు, 9 ఎక్స్ ఆఫీషియో సభ్యులు కలిపి మొత్తం 50 మంది ఉండగా బీజేపీకి 18 మంది కార్పొరేటర్లు, 6గురు ఎక్స్ ఆఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 24 మంది ఉన్నారు. అలాగే కాంగ్రెస్‌కు ఏడుగురు కార్పొరేటర్లు, ఏడుగురు ఎక్స్ ఆఫీషియో సభ్యులు కలిపి మొత్తం 14 మంది ఉన్నారు. బీఆర్ఎస్‌కు 15 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎక్స్ ఆఫీషియో సభ్యులు కలిపి మొత్తం 24మంది ఉన్నారు. సరిపడా సంఖ్యా బలం లేకపోయినప్పటికీ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తొలిసారి బరిలో నిలిచింది. ఇరవై రెండేళ్లుగా ఏకగ్రీవం అవుతున్న హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్ని కలకు ఈసారి పోలింగ్ జరుగుతుండటంతో ఈ ఎన్నికల్లో ఎవరు నెగ్గుతారు అనే ఉత్కంఠ నెలకొంది.

# గ్రేటర్‌లో బాలికలదే హవా..

-ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు



**హైదరాబాద్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో భాగంగా గ్రేటర్‌లో బాలికలు సత్తా చాటారు. రాష్ట్రంలోనే ఫస్ట్ ఇయర్‌లో మేడ్చల్-మల్కాజిగిరి ప్రథమ, రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానాలు దక్కించుకోగా, సెంకడ్ ఇయర్‌లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు వరసగా మూడో స్థానం, రంగారెడ్డి జిల్లా నాల్గోవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. అలాగే ఫలితాల్లో మరోమారు హైదరాబాద్ జిల్లా చతికల పడింది. మొత్తం మీద ఇంటర్మీడియట్ పరీక్షల్లో గ్రేటర్ హైదరాబాద్‌కు 73 శాతం ఉత్తీర్ణత లభించింది. గతేడాది కంటే మూడు శాతం ఉత్తీర్ణత పెరిగినట్లయింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో కలిపి ఇంటర్ ప్రథమ సంవత్సరం జన రల్, వృత్తి విద్య కోర్సులో కలిపి 73.41 శాతం , ద్వితీయ సంవత్సరంలో 73.39 శాతం ఉత్తీర్ణత లభించింది. జిల్లాల వారిగా పరిశీలిస్తే ప్రథమ సంవత్సరంలో హైదరాబాద్ లో 66.68 శాతం, రంగారెడ్డి జిల్లాలో 76.36 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి 77 .21 శాతం, ద్వితీయ సంవత్సరంలో మేడ్చల్ జిల్లా 77.91 శాతం, రంగారెడ్డి జిల్లా 77.53 శాతం. హైదరాబాద్ 67.74 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

**మళ్లీ బాలికలదే హవా..**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలదే హవా కొనసాగింది. ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సుల్లో ఫలితాలు పరిశీలిస్తే మేడ్చల్-మల్కాజిగిరిలో బాలికలు 82.40 శాతం, బాలురు 73.54 శాతం,రంగారెడ్డి జిల్లాలో 81.92 శాతం బాలికలు,72.24 శాతం బాలురు, హైదరాబాద్ జిల్లాలో74.65 శాతం బాలికలు, 60.47 శాతం బాలురు ఉత్తీర్ణత సాధించారు.ద్వితీయ సంవత్సరంలో ఫలితాలు పరిశీలిస్తే.. మేడ్చల్‌లో 82.21 శాతం బాలికలు, 74.56 శాతం బాలురు, రంగారెడి జిల్లాలో 82 శాతం బాలికలు, 73.70 శాతం బాలురు, హైదరాబాద్ జిల్లాలో బాలికలు 74.81 శాతం, బాలురు 59.50 శాతం, ఉత్తీర్ణత సాధించారు.

# టిమ్స్ ఆస్పత్రుల పనులు వేగవంతం



**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త**

గ్రేటర్ నలుమూలలా ప్రజలకు వైద్య సేవలందించేందుకు నిర్మిస్తున్న మూడు టిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రుల నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది నాటికి ప్రజలకు వైద్య సేవలందించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎర్రగడ్డలోని టిమ్స్ ఆస్పత్రి పనులు పూర్తి చేసి తెలంగాణ అవతరణ దినోత్సవం (జూన్ 2వ తేదీ) నాటికి అందుబాటులో తీసుకురావాలనే సంకల్పంతో ఉన్నారు. కొత్తపేట, అల్వాల్‌లోని సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రుల పనులను కూడా పూర్తి చేసి డిసెంబర్ నాటికి వైద్య సేవలందించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల మూడు అస్పత్రుల నిర్మాణ పనులను పర్యవేక్షి స్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిజానికి ఈ ఆస్పత్రులను పద్దెనిమిది నెలల్లోనే అందుబాటులోకి తీసుకురావాలని గత ప్రభుత్వం యోచించింది. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి కూడా ఆస్పత్రుల నిర్మాణం పెద్దగా ముందుకు కదలలేదు. దాదాపు రెండేళ్లపాటు ఈ పనులు నత్తనడకన సాగాయి. గత ఆరేడు నెలల నుంచే పనుల్లో వేగిరం పెరిగింది.

**అన్ని విభాగాలకు ప్రత్యేక ఏర్పాట్లు..**

శస్త్రచికిత్సలను నిర్వహించేందుకు ఆధునాతనమైన 26 ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేయనున్నారు. గుండె, న్యూరాలజీ, ప్లాస్టిక్, యురాలజీ, గ్యాస్ట్రో ఎంటారాలజీ, క్యాన్సర్, వ్యాస్కులర్, ఎండోక్రైనాలజీ, నెఫ్రాలజీ, పిల్లలకు సంబందించిన జబ్బులకు చికిత్సలు అందించే ఏర్పాట్లు చేయనున్నారు. గుండెకు సంబందించిన అన్ని రకాల సేవలు అందించడానికి ప్రత్యేకంగా క్యాథ ల్యాబ్‌లు, మూత్రపిండాల బాధితుల కోసం కిడ్నీ డయాలసిస్ సేవలు, క్యాన్సర్ బాధితుల కోసం రేడియేషన్, కిమోథెరపీ విభాగాలు ఏర్పాటు చేయమన్నారు. అన్ని రకాల వ్యాధులను సత్వరమే గుర్తించడానికి సిటీ స్కాన్, ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి వస్తాయి. సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న అన్ని పడకలకు ఆక్సిజన్ సదుపాయం కల్పించనున్నారు. ఒక్కో ఆస్పత్రిలో 200 మంది ఫ్యాకల్టీ, 500 మంది రెసిడెంట్ డాక్టర్ల ద్వారా వైద్య సేవలను అందించనున్నారు.

**ఎల్బీనగర్‌లో...**

ఎల్బీనగర్‌లో నిర్మించనున్న టిమ్స్ ప్రత్యేకంగా 314 ఐసీయూ పడకలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో మిగతా సాధారణ పడకలు 476, అత్యవసర పడకలు 35, ఇతర అవసరాల కోసం మరో 200 పడకలు సిద్ధమవుతున్నాయి. 16 మేజర్, 7 మైనర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు యుటీనిటీ బ్లాక్ (జీ ప్లస్ 1), ధర్మశాల (జీ ప్లస్ 3) నిర్మాణ పనులు చేస్తున్నారు.

**ఎర్రగడ్డలో...**

ఎర్రగడ్డ టిమ్స్‌లోని ఎమర్జెన్సీ వార్డులో పేషంట్లు వెయిటింగ్ చేయకుండా అడ్వాన్స్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నారు. పేషెంట్లకు వేగంగా అపాయింట్మెంట్ దొరికేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రేడియోలజీ, ఎమర్జెన్సీ వార్డులు, ఎంఆర్ఐ, సిటీ స్కాన్ రూమ్‌లను పేషెంట్లకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు.

**అల్వాల్‌లో రూ.879 కోట్ల అంచనాలతో..**

అల్వాల్‌లో 1153 లక్షల చదరపు అడుగుల విస్తీరణంలో రూ.879 కోట్ల అంచనాలతో అల్వాల్ టిమ్స్ అస్పత్రి నిర్మాణం జరుగుతున్నది. పనులను ఈ ఏడాది నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నారు. ఇక్కడ 35విభాగాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. మేజర్ ఓపీ, ఎమర్జెన్సీ, రేడియల్ వార్డు, అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.2,679 కోట్లతో నిర్మాణ పనులు...**

అప్పటి బడ్జెట్ అంచనాల మేరకు ఈ మూడు ఆస్పత్రులను రూ.2,679 కోట్లతో నిర్మిస్తున్నారు. ఒక్కో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణ పనులు 13.71 లక్షల చదరపు అడుగల విస్తీర్ణంలో జరుగుతున్నాయి. కొత్తపేటలో నిర్మించనున్న ఆస్పత్రికి 21,36 ఎకరాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో 14 అంతస్తుల నిర్మాణానికి పూనుకున్నారు.

**30 ప్రత్యేక వైద్య విభాగాలు...**

ఒక్కో ఆస్పత్రిలో 30 ప్రత్యేక వైద్య విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. సూపర్ స్పెషాల్టీలో పీజీ కోర్సులు, నర్సింగ్, పారామెడికల్ విద్యను బోధించనున్నారు. వైద్య విద్య కోసం పీజీ, సూపర్‌స్పెషాల్టీ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటికి అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఇన్ నర్సింగ్, పారామెడికల్ విద్యకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ఆస్పత్రులు అందుబాటులోకి వస్తే అన్నిచోట్ల సూపర్ స్పెషాల్టీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో ఆస్పత్రిలో 16 స్పెషాల్టీ, 15 సూపర్ స్పెషాల్టీ సేవలందించనున్నారు. ఒక్కో అస్పత్రిలో వెయ్యి పడకలు ఏర్పాటు చేస్తారు.

# కూకట్‌పల్లి చెరువులను అభివృద్ధి చేయాలి

- హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీలు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌లు

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువుల అభివృద్ధి ధ్యేయంగా కొన్ని చెరువులను అభివృద్ధి చేశామని కూకట్‌పల్లి నియోజకవర్గంలో మిగిలిన చెరువులను అభివృద్ధి చేయాలని కోరుతూ మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఉన్నటువంటి 9 చెరువులు రెండు కుంటలు కాజ కుంట, హౌసింగ్ బోర్డు సంబంధించినటువంటి కుంటలను అభివృద్ధి చేయాలని అందులో ఐడీఎల్ చెరువు, బోయిన చెరువును, ములకత్వ చెరువు నల్ల చెరువులో కొంత భాగం సుందరీకరణం చేశామని తెలియజేశారు. వాటిపై కోర్టులో కేసులు ఉండటం వలన పూర్తిగా అభివృద్ధి జరగలేదని దానిపై కమిషనర్ న్యాయస్థానం ద్వారా వివరాలను సేకరించి నియోజకవర్గంలో మిగిలిన చెరువులను సుందరీకరణం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణారావు కోరారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి భూయజమానులు కావచ్చు, కొనుగోలు చేసిన వారు కావచ్చు ఎవరైనా వారికి టిడిఆర్ ఇచ్చి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భూ యజమానులకు టిడిఆర్ ఇచ్చే సమయంలో వారి దగ్గర కొనుగోలుదారులు ఎవరో అమ్మిన వారెవరో నిజ నిజాలు తెలుసుకొని వారికి టిడిఆర్ ఇచ్చే విధంగా ప్రయత్నం చేయాలని చెరువులను అభివృద్ధి చేసే సమయంలో నల్లచెరువు ఐడియల్ చెరువు లాంటి వాటికి నాల డైవర్షన్ ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు ఆలస్యం జరుగకుండా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే హైడ్రా కమిషనర్ రంగనాథుని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధి చేసే సమయంలో పార్టీలకు అతీతంగా ఎవరైనా కబ్జాలకు పాల్పడినా వారిపైన చర్యలు తీసుకోవాలి తప్ప అభివృద్ధిలో మాత్రం ఎక్కడ జాప్యం జరగకుండా పనులు చేయాలన్నారు. వినతి పత్రాన్ని స్వీకరించిన అనంతరం హైడ్రా కమిషనర్ సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూ యజమానులకు కొనుగోలుదారుల వివరాలను సేకరించి టిడిఆర్ ఇప్పించి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అదేవిధంగా అమృత నగర్ తాండవాసులు వర్షాలు వస్తే మునిగిపోయి డ్రైనేజ్ నీరు ఇండ్లలోకి వచ్చే ప్రాంతంలో ఉన్నటువంటి తాండావాసులకు ఇప్పటికే 70 మంది కుటుంబాలకు గత ప్రభుత్వంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇప్పించడం జరిగిందని పెండింగ్ లో ఉన్నటువంటి 60 మంది నిరుపేదలకు కైతలాపూర్ లోని డబల్ బెడ్ రూములు ఇప్పించి నిరుపేదల కుటుంబాల ఆరోగ్యలను కాపాడే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కోరారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఫెన్సింగ్ వేస్తున్న ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త:** 1200 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం అక్రమణకు గురికాకుండా ఉండేందుకు హద్దులు నిర్ణయించి చేపట్టిన ఫెన్సింగ్ పనులను శనివారంలోగా పూర్తిచేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 ఏసీబీ కార్యాలయం ముందు సర్వే నంబర్ 102/1లో గల1200 కోట్ల విలువగల 12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అక్రమణలు జరగకుండా ఉండేందుకు డీజీపీఎస్ సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలానికి హద్దులు నిర్ణయించి 35 లక్షల రూపాయలతో జిఐ షీట్స్, ఐరన్ పోల్స్ తో చేపట్టిన పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువమంది కూలీలను పెట్టి డే అండ్ నైట్ పనులు చేపట్టి ఫెన్సింగ్ పనులను శనివారంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ స్థలంలో ఈ స్థలం ప్రభుత్వానిదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలమును ఎవరైనా కబ్జాకు/ ఆక్రమణకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, షేక్ పేట తహసిల్దార్ అనితారెడ్డి, డిఈ సంజీవ్, ఏఈ శ్రీధర్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన అధికారులు

-అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు : ఎసిపి శ్రీధర్



**అత్తాపూర్ ఏప్రిల్22,ప్రభాతవార్త :** అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కటేదాన్‌లో అక్రమ నిర్మాణాలను భారీ పోలీస్ బందొబస్తు మధ్య ఉదయం నుంచి ఐదు నిర్మాణాలను మూడు జెసిబిల సహాయంతో కూల్చివేశారు.ఈ కూల్చివేతలను టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ దగ్గర ఉండి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ....ఎలాంటి పర్మిషన్ లేకుండా నిర్మించిన షెడ్లు తొలగించడం జరిగిందని అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.అక్రమ నిర్మాణాల చేపట్టిడితే ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు.

## నేడు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

**హైదరాబాద్,ఏప్రిల్22, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనమండలి ఎనిక్నల నేపథ్యంలో బుధవారం, శుక్రవారం నగరంలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. టీ.జంక్షన్ నుంచి బీఆర్‌కేఆర్ జంక్షన్ వరకు ట్రాఫిక్ అనుమతించరు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపు నుంచి బీఆర్‌కేఆర్ మార్గం, తెలుగుతల్లి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను అంబేడ్కర్ విగ్రహం మీదుగా మళ్లించనున్నారు

## నిషేధిత దగ్గు సిరప్స్ డ్రగ్స్ సరపరా చేస్తున్న ముఠా అరెస్టు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కోడిన్ ఆధారిత దగ్గు సిరప్‌ను అక్రమంగా మళ్లిస్తున్న నెట్‌వర్క్‌ను తెలంగాణ ఎక్సైజ్‌శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు .ఈ కేసుకు సంబంధించి ఎక్సైజ్ శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పొలిసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్‌శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు, రామంతాపూర్ దగ్గర ఇద్దరు వ్యక్తుల నుంచి నిషేది గంజాయిని 1.050కేజీల పట్టుకున్నారు. ఈ కేసులో వైభవ్ కులకర్ణి, మనుపాటి భాను ప్రకాష్‌లు ఉన్నారు. విచారణలో వీరు సికింద్రాబాద్ లాలాపేట్ ప్రాంతంలో ఒక మహిళ నిషేధిత కోడిన్ పాస్ఫేట్ సిరప్ అమ్ముతొందని వెల్లడిరచారు. ఈ సమాచారం ఆధారంగా మౌలాలి బ్రిడ్జి సమీపంలో నిఘా పెట్టి నల్ల రజనీ స్కూటర్‌పై 13 బాటిళ్ల కోడిన్ పాస్ఫేట్ సిరప్ బాటిళ్లను తీసుకు వెళుతుండగా పట్టుకున్నారు. విచారణలో ఆమె ఈ మందులను జెనరిక్ వరల్డ్ మెడికల్ షాపు, విద్యానగర్, హైదరాబాద్ నుంచి తీసుకువెళ్తున్నట్లు తెలిపింది .దీంతో అధికారులు ఆ మెడికల్ షాపులో సోదాలు నిర్వహించారు. మెడికల్ షాపులో పెద్ద మొత్తంలో బాటిళ్ల కోడిన్ సిరప్‌లు లభించాయి. ఈ బాటిళ్లు ఎక్కడినుండి తీసుకు వస్తున్నారని అధికారులు విచారణ మొదలుపెట్టగా ఓల్డ్ బోయిన్‌పల్లిలోని ఆర్ఆర్ నగర్‌లో గల హిమాలయ ఫార్మసీ నుంచి కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ పార్మసీని జనరిక్ వరల్డ్ మెడికల్ షాపు లైసెన్స్‌దారుని బంధువు నిర్వహిస్తున్నాట్లు అధికారులు వెల్లడించారు ఈ క్రమంలో ఈ షాపులో దాడులు నిరవహించగా ఈ ఫార్మసీ 80 నిషేదిత కోడిన్ పాస్పేట్ సిరప్ లభించగా సరఫరా చేస్తున్న నల్ల రజనీ, అన్‌మోల్ కుమార్ పింగాల్, దినేష్ కుమార్ గోయల్‌పై కేసు నమోదా చేసినట్లు అధికారులు తెలిపారు. నిషేధిత కోడిన్ పాస్పేట్ సిరప్ డ్రగ్స్ లను సరఫరా చేస్తున్న ఓల్డ్ బోయినపల్లి హిమాయలయ ఫార్మసీ లైసెన్సులు వుంది కూడా ఈ లాంటి నిషేధిత డ్రగ్స్‌ను సరఫరా చేసినందుకు ఫార్మసీని సీజ్ చేశారు. అనంతరం ఈ ఫార్మసీని లైసెన్స్‌లు రద్దు చేయాలని సంభందిత అధికారులకు సిఫార్సు చేసినట్లు వెల్లడించారు ఈ మేరకు స్థానిక బోయినపల్లి పోలీసులు కేసు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తునట్లు ఇన్స్పెక్టర్ లక్ష్మినారాయణ రెడ్డి వెల్లడించారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఏఈఎస్ జె. జీవన్ కిరణ్,సీఐ బాలరాజు, ఎస్సై రవిలు, డ్రగ్ కంట్రోల్ డ్రగ్ ఇన్ స్పెక్టర్లు డి.సరిత, కె. ప్రభాకర్,బి.గోవింద్ సింగ్ , రేణుక, తిరుపతి రావు,నరేష్ రెడ్డి,ఐ శ్రీకాంత్‌లు పాల్గున్నారు.

## హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు...



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి శ్రీనివాసరావు

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** కుటుంబ తగదాలతో భర్తపై విరక్తిని పెంచుకున్న భార్య, భర్తను హత్య చేసిన ఘటనలో భార్యతోపాటు ఇద్దరూ నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కేపీహెచ్బీ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కాపుగంటి శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా పాపన్నపేట ప్రాంతానికి చెందిన మృతుడు సాయిలుతో కవితకు 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అయితే గత 15 సంవత్సరాల నుండి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవని పోలీసులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు ఇరువురు అనారోగ్యం కారణంగా వేరువేరుగా ఉంటున్నారు. కాగా తల్లిదండ్రులు వేరువేరుగా ఉన్న పిల్లల విషయంలో ఇద్దరి మధ్య తగాదాలు నెలకొనడంతో ఎలాగైనా భర్తను హతమార్చాలని కవిత పథకం పన్నింది. వారం రోజుల క్రితం సొంత ఊరు నుండి భర్తను హైదరాబాద్‌కు తీసుకువచ్చి చెల్లెలు జ్యోతి, మరిది మల్లేష్ వాళ్ళ ఇంట్లో ఉంచింది. గత ఆదివారం మృతుడు సాయిలు కళ్ళు సేవించడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మృతుడి భార్య కవిత వారు ఉంటున్న గుడిసెలో కరెంట్ షాక్ ఇచ్చింది. దీంతో మృతుడు సాయిలు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా కవిత గొంతు పిసకగా, ఆమె చెల్లెలు జ్యోతి కాళ్లు పట్టుకుంది. మరిది మల్లేష్ సాయిలు మర్మాంగాలను తీవ్రంగా వత్తడంతో సాయిలు మృతి చెందాడు. సోమవారం ఉదయం 5 గంటలకు ఆటో డ్రైవర్ వాలియ నాయక్ కు ఫోన్ చేసి చెత్త మూటను సంగారెడ్డికి తీసుకుపోవాలని రూ.3,500 ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. సాయిలు మృతదేహాన్ని సంచిలో కట్టి చెల్లెలు జ్యోతి, మరిది మల్లెష్ సహాయంతో ఆటోలో ఎక్కి సంగారెడ్డి సమీపంలోని స్మశాన వాటికకు చేరుకున్నారు. అక్కడ మూట దించే విషయమై ఆటోడ్రైవర్ కి వారికి మధ్య వాగ్వాదం జరిగింది. మూట నుండి దుర్వాసన రావడంతో ఆటో డ్రైవర్ వాలియ నాయక్ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో తిరిగి మళ్ళీ మిత్ర హిల్స్ వద్దగల గుడిసెకు చేరుకున్నారు. అక్కడ మూట దించేసిన ఆటో డ్రైవర్ ఉదయం 10 గంటలకు కేపీహెచ్బీ పోలీసులకు సమాచారం అందించినట్లు ఏసిబి శ్రీనివాసరావు తెలియజేశారు. నిందితులు కవిత, జ్యోతి మల్లేష్‌లను అరెస్టు చేసినట్లు తెలియజేశారు. సకాలంలో సమాచారం ఇచ్చి కేసును ఛేదించేలా చేసిన ఆటో డ్రైవర్ కు రివార్డు ప్రకటించినట్లు ఏసీపి శ్రీనివాసరావు తెలియజేశారు.

## ఈఎస్ఐసి కార్డు ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం : శ్రీనివాస్ రెడ్డి



ఈఎస్ఐ కార్డు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

**నిజాంపేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**

ఈఎస్ఐసి కార్డు ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి సూచించారు. నిజాంపేట రాజీవ్ గృహకల్ప మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఈఎస్ఐసి కార్డు పొందిన రాఘవులు పోతుకు మంగళవారం ఈఎస్ఐసీ సభ్యుల సమక్షంలో కొలను శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక రాజ్య బీమా సేవలు మెరుగైన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. నిరుపేదల ఆరోగ్యానికి ఈఎస్ఐ కార్డు భరోసాగా నిలుస్తుందని అన్నారు. అర్హులైన వారికి కార్డులను ఇప్పించడంలో మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముమ్ముందు కూడా తమ సేవలను మరింత విస్తృతం చేయాలని సభ్యులకు సూచించారు. కాగా రాజీవ్ గృహకల్పలోని మదర్ థెరిస్సా విగ్రహం ఉన్న ఎత్తయిన ప్లాట్ ఫారంను ఎక్కి దిగేందుకు వీలుగా సుమారు 50 వేల రూపాయల వ్యయంతో నిచ్చెన ఏర్పాటు చేసేందుకు కొలను శ్రీనివాస్ రెడ్డి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, సత్యనారాయణ, రాఘవేందర్, వేణుగోపాల్, చంద్రశేఖర్, సంతోష్ కుమార్, రాజేశ్వర్, జ్యోతి చౌదరి రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం అహర్నిశలు పాటుపడతాం

**- రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని దర్గాలో ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తున్న కార్తిక్‌రెడ్డి తదితరులు.

**నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** నిరంతరం నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం పరితపించిన ప్రజానాయకుడు ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు అహర్నిషలు పాటు పడుతామని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కార్పోరేషన్ పరిధిలోని దర్గాలో ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి టీఆర్ఎస్ అధ్యక్షులు రావులకోల్ల నాగరాజు నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా మా కుటుంబం మొత్తం ప్రజాసేవకు అంకితమయ్యిందన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించడం కోసమే పని చేస్తున్నామన్నారు. ఇంద్రన్న పిలుపు మేరకు యుక్త వయసులో రాజకీయంలోకి వచ్చిన వారే నేటికీ రంగారెడ్డి జిల్లాలోని అన్ని పార్టీల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు డాక్టర్ నవాబ్ ముంతాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు రవీందర్‌రెడ్డి, రాముడు యాదవ్, రవి కుమార్, పాండు, వెంకటేష్, సుధాకర్‌గౌడ్, చంద్రశేఖర్, అశోక్, శాంతి కుమార్, వినోద్, శామ్యూల్, పెంటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### సాలార్‌జంగ్ మ్యూజియంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

**చార్మినార్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియంలో మే నెల 12 నుంచి 24 తేదీ వరకు బాల బాలికలు కోసం సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని మ్యూజియం క్యూరేటర్ డాక్టర్. ఆర్.బి.నాయక్ తెలిపారు. 8 నుంచి 12 సంవత్సరాలు లోపు వయస్సు గల బాల బాలికలను జూనియర్లుగా, 13 నుంచి 16 సంవత్సరాలు వయస్సు గల బాల బాలికలను సీనియర్లుగా విభజించి సమ్మర్ ఆర్ట్‌ను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు. యోగ, ఆర్ట్ లివింగ్, లెక్చరర్స్ ఆన్ ఇండియన్ ఆర్ట్, హెరిటేజ్ అవేర్‌నెస్, డ్రాయింగ్, పెయింటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎస్‌యుపిడబ్ల్యు తదితర అంశాలపై సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌లో శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 1500 రూపాయలు సాలార్‌జంగ్ మ్యూజియంలోని రిషప్షన్ కౌంటర్‌లో చెల్లించి ధర ఖాస్తు ఫారాలు పొంద వచ్చునని ఆయన తెలియ జేశారు. మే నెల 5వ తేదీ లోపు అడ్మిషన్ ఫారాలను సమర్పించాలని, మే నెల 8వ తేదీన ఫైనల్ లిస్ట్ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నగరంలోని పాఠశాలు, హైస్కూళ్లకు చెందిన బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని మ్యూజియం క్యూరేటర్ ఆర్.బి.నాయక్‌తెలియజేశారు.

### జూపార్కులో ఐదు నుంచి పదవ తరగతి విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

**చార్మినార్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో మే నెల ఒకటి నుంచి జూన్ ముప్పై వరకు రెండు నెలలు పాటు ఐదు నుంచి పదివ తరగతి విద్యార్ధులకు సమ్మర్‌ను క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని జూ అధికారులు వెల్లడించారు. సమ్మర్ క్యాంపులో జూ పార్కులోని జంతువుల ఆహారం, జీవిత, విశేషాలతో పాటు జూ పార్కు చరిత్ర గురించి విపులంగా వివరిస్తారు. సమ్మర్ క్యాంపులో పాల్గొనే ప్రతీ ఒక్కరు రోజుకు వెయ్యి రూపాయలు చెల్లించ వలసి ఉంటుందని అధికారులు తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో పర్యాటకులకు అల్పాహారం. భోజనం వసతిని కల్పిస్తున్నారు. అదే విధంగా జూ పార్కులోని ఎన్‌క్లోజర్‌లోని జంతువుల గురించి సమ్మర్ క్యాంపులో జూ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వివరిస్తారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన దలచిన వారు ఆన్‌లైన్‌లో వెయ్యి రూపాయలు చెల్లించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని జూ అధికారులు కోరారు.

### సెయింట్ పీటర్స్ హై స్కూల్‌లో ఘనంగా ఎర్త్‌డే వేడుకలు



పర్యావరణ స్థిరత్వ వక్తచారును సత్కరిస్తున్న సెయింట్ పీటర్స స్కూల్ యాజమాన్యం

**కంటోన్మెంట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వరల్డ్ ఎర్త్‌డేను పురస్కరించుకొని బోయిన్‌పల్లి సీతారాంపూర్‌లోని సెయింట్ పీటర్స్ హై స్కూల్‌లో మంగళవారం స్టార్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ పేరిట మంగళవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో వరల్డ్ ఎర్త్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పర్యావరణ స్థిరత్వం వక్తచార్ధ్యాయని ముఖ్య అతిథులుగా హాజరై వరల్డ్ ఎర్త్‌డే అంశంపై వివరించారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలన్నారు. విద్యార్థులు చిన్న వయసులో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎల్ఈడి స్క్రీన్, మ్యూజిక్ లైట్లతో కళ్లకు కట్టినట్లు అకాశంలోని నక్షత్రాలు పక్కనే ఉన్నట్లుగా ఎల్ఈడి స్క్రీన్ వివేషంగా అకర్షించింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కరస్పాండెంట్ అల్ఫోన్స రెడ్డి, ప్రినిసపాల్ సువర్ణలు అతిథులకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## విఎన్ఆర్ కళాశాలలో 5 రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభం



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**నిజాంపేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**

ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో రహదారుల వ్యవస్థలో భూకృత్రిమ పదార్థాల వినియోగంపై 5 రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కేంద్ర రోడ్డు పరిశోధన సంస్థ (సిఆర్ఆర్ఎ), భారత ప్రభుత్వ వస్త్రమంత్రిత్వ శాఖ ప్రాయోజిత జాతీయ సాంకేతిక వస్త్ర సాధన పథకం కింద విఎన్ఆర్ విజెఐఈటీతో కలిసి కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఆర్ఆర్ఐ సంచాలకులు, ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్సి) అధ్యక్షులు ఆచార్య డా. మనోరంజన్ పరిడా పాల్గొన్నారు. సిఆర్ఆర సంస్థలోని సిఎస్ఐఆర్‌కి చెందిన వివిధ విభాగాల శాస్త్రవేత్తలు ఆచార్య డా. పులికంటి సుబ్రహ్మణ్య ప్రసాద్, ఆచార్య డా.కైతా రవీందర్, డా. గొట్టుముక్కల భరత్ తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఐటి రంగంలోనే కాక ఇన్ఫ్రా రంగంలోనూ హైదరాబాద్ ముందంజలో ఉందని ప్రశంసిస్తూ రహదారుల పరిణామంలో భారతదేశం ప్రపంచంలోనే రెండవ స్థానంలో ఉండటానికి 73 యేళ్ళుగా సిఆర్ఆర్ఐ 90 యేళ్ళుగా ఐఆర్సి కృషి చేస్తున్నాయని వివరించారు. విఎన్ఆర్ విజెఐఈటీ వంటి పేరెన్నిక గన్న విద్యాసంస్థతో సిఆర్ఆర్ఐ, ఐఆర్సి కలిసి సంయుక్త సాంకేతికసదస్సు నిర్వహణ, ఇంటర్న్షిప్ల అవకాశాలు వంటి భాగస్వామ్యానికి ఈ శిక్షణా కార్యక్రమం నాంది కానుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించను న్న నిపుణులైన అనుభవజ్ఞుల ద్వారా నవీన సాంకేతికతల బాధ్యతాయుతమైన ప్రయోగాలని అందిపుచ్చుకోవాలని పాల్గొతలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం తమ కళాశాల నిర్వహించే అవకాశానికి కృషి చేసిన తమ అడ్జంక్ట్ ప్రొఫెసర్ డా. సీతారామాంజనేయులకు కృతజ్ఞతలు తెలుపుతూ సమన్వయకర్త అయిన సివిల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు డా.ఎ. రమేశ్ జియోసింథెటిక్స్ వలన జరగనున్న అభివృద్ధిని స్థూలంగా వివరించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య డా. కె. రామూజీ మాట్లాడుతూ తమ విభాగం ద్వారా రూ.1.24 కోట్ల విలువ గల పరిశోధన, అభివృద్ధి జరిగిందని, ఈ శిక్షణ భరణీయాభివృద్ధి వైపుకు మరో అడుగు కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య డా. టి. వంశీ నాగరాజు కూడా ప్రసంగించగా మరొక సమన్వయకర్త, విఎన్ఆర్ విజెఐఈటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగ సహాయాచార్యులు డా. టి. నాగ తేజ సభికులకు ధన్యవాదాలు తెలిపారు.

## సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో సత్తా చాటిన తెలుగు విద్యార్థులు



ర్యాంకర్లను సత్కరిస్తున్న అశోక్ నగర్ లోని లా ఎక్సిలెన్స్ ఐఎఎస్ అకాడమి అధినేత రాంబాబు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో తెలుగు విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. మంగళవారం అశోక్ నగర్ లోని లా ఎక్సిలెన్స్ ఐఎఎస్ అకాడమి, సిఎస్‌బి ఐఏఎస్ అకాడమికి రాంకుల పంట పండింది. అశోక్ నగర్ లోని లా ఎక్సిలెన్స్ ఐఏఎస్ అకాడమిలో శిక్షణ పొందిన సాయి చైతన్య జాదవ్ కు దేశవ్యాప్తంగా 68వ ర్యాంక్ వచ్చింది. ఈ అకాడమీ నుంచి 100కు పైగా విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 77 మంది మంచి ర్యాంకులు సంపాదించి తమ అకాడమీకి పేరు తీసుకువచ్చారని అకాడమీ చైర్మన్ డాక్టర్ రాంబాబు సంతోషం వ్యక్తం చేశారు. తమ అకాడమీకి ఎనిమిది, పదకొండు, పదిహేనుతో పాటు 31, 41, 43 ర్యాంకులతో పాటు వందల ర్యాంకులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**నాన్న కానిస్టేబుల్... అయినా కష్టపడి చదివా... ర్యాంకర్ సాయి చైతన్య జాదవ్**

గిరిజనుల జిల్లా ఆదిలాబాద్ జిల్లా పాల్తీ తండా కు చెందిన తాను ఆరవసారి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి 68వ ర్యాంకు సాధించడం జరిగిందని సాయి చైతన్య జాదవ్ అన్నారు. తాను ప్రభుత్వ జవహర్ నవోదయ స్కూల్లో చదువుకున్నానని కష్టపడి రాంక్ సాధించడం జరిగిందని అన్నారు.

**ప్రభుత్వ స్కూల్లో చదివి ర్యాంకు సాధించా... 938 ర్యాంకర్ శ్రీ నికేష్**

వరంగల్ జిల్లా హనుమకొండ ప్రాంతానికి చెందిన శ్రీనికేష్ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 938 ర్యాంకును సాధించారు. తన ప్రభుత్వ స్కూల్లో చదువుకొని, ఐదవ సారి పరీక్షలు రాసి విజయం సాధించానని అన్నారు.

## ప్రతి ఒక్కరిలో మాతృభాషాభిమానం ఉండాలి : హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్



కావ్యావిష్కరణ కావిస్తున్న జస్టిస్ కె.లక్ష్మణ్, నిత్యానందరావు, ఓలేటి, కిషన్‌రావు, సత్యనారాయణ, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** మాతృభాష మీద అభిమానంతోపాటు తప్పకుండా మాతృభాషను నేర్చుకోవడమే కాకుండా మాతృభాషలో సంభాషించుకోవాల్సిన అవసరం ప్రతీఒక్కరికీ ఉందన్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అప్పుడే మనకు, భాషకు మనుగడ, గౌరవాభిమానాలు చూరగొంటామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సత్కళాభారతి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన కావ్యావిష్కరణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ కె.లక్ష్మణ్ విశిష్ట అతిథులు డా. ఓలేటి పార్వతీశం, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, రచయిత కిషన్‌రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సత్కళాభారతి జి.సత్యనారాయణ తదితరులతో కలిసి న్యాయవాది సూగూరు కిషన్‌రావు రచించిన కవనం నా ఊపిరి కావ్యాన్ని ఆవిష్కరించి న్యాయవాది వృత్తిలో ఉండి కూడా ఎంతో ఆసక్తి, తెలుగు భాషాభిమానంతో అద్భుత కావ్యాన్ని రచించిన కిషన్‌రావుకు శుభాభినందనలు తెలిపారు. చివరిగా తెలుగుభాషను, భాషాభిమానులు, రచయితలను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జస్టిస్ నొక్కివక్కాణించారు.

## ప్రజల దాహార్తిని తీర్చేదే నిజమైన సేవ

**-బాలానగర్ డిప్యుటీ పోలీస్ కమిషనర్ సురేశ్‌కుమార్**



షాపూర్‌నగర్ చౌరస్తాలో వేసవి చలివేంద్రాన్ని ప్రారంభించి నీటిని అందిస్తున్న బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్, ఎసిపి హనుమంతరావు, జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తదితరులు

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త**

చలివేంద్రాల ద్వారా ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోలీసులు ప్రజలతో మమేకమై పనిచేయాలని సైబరాబాద్ బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ సురేశ్ కుమార్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్ చౌరస్తాలోని ఇఎస్ఐ ఆసుపత్రి సమీపంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌తోపాటు స్థానికుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా బలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ... సైబరాబాద్ పోలసు కమి షనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో చలివేంద్రాల ఏర్పాటుకు, ఇతర అవసరాలకోసం పోలీసులు, ప్రజలు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. బాలానగర్ ఎసిపి పరిధిలోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాల అమలుకు ప్రజలు ముందుకు వస్తే పోలీసులు తమవంతు సహాయ సమకారాలను అందిస్తారని సూచించారు. బాలానగర్ ఎసిపి హనుమంతరావు, జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌లు పూర్తి సహాయ, సహకారాలు అందించినట్లుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ లోభాగంగా ఈ సేవాకార్యక్రమంలో ప్రజలను, చుట్టుపక్కల వ్యాపారులను కూడా భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం భవిషత్‌లో ఉత్తమఫలితాలను అందిస్తుందని అన్నారు. బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రజలు పోలీసులు సమన్వయంతో వ్యవహరిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్ మాట్లాడుతూ షాపూర్‌నగర్ వంటి ప్రధాన కూడళ్లలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా చలివేంద్రాన్ని బాలానగర్ డిసిపి సురేశ్‌కుమార్, బాలానగర్ ఎసిపి హనుమంతరావుల సహకారాలతోపాటు ప్రజల సహాయ, సహకారాలు తీసుకున్నట్లు తెలిపారు.

### ఇష్టపడి చదివితే కష్టమేమి కాదు

**-సిఎస్‌బి అకాడమి అధినేత్రి బాలలత..**

**చిక్కడపల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** కష్టపడి ఇష్టపడి చదివితే సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకు సాధించడం పెద్ద కష్టమేమి కాదని ప్రముఖ విద్యావేత్త, సిఎస్బి అకాడమీ అధినేత్రి బాలలత అభిప్రాయపడ్డారు. ఈసారి సివిల్స్ పరీక్ష ఫలితాల్లో మధ్యతరగతి ర్యాంకులు సాధించడం గర్వకారణం అని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల చెందిన విద్యార్థి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని అన్నారు ఈ సందర్భంగా మంగళవారం అకాడమీ ఆవరణలో జరిగిన సన్మాన సభలో ర్యాంకర్లను సత్కరించి అభి నందించారు. సన్మానించారు. తమ అకాడమీకి పదికి పైగా అంకులు ర్యాంకులు వచ్చాయని, ఇందులో రావుల జయసింహారెడ్డి (46), సాయి చైతన్య జాదవ్ (68), కృష్ణసాయి(190), పవన్ కుమార్ (375), సూర్య తేజ (647), సందీప్ కుమార్ (667), సాయి భార్గవ్(798), టి. సూర్య తేజ (799), సాయి మోహిని మానస (975) లు ర్యాంకులు సాధించాలని తెలిపారు.

### ఆప్కో కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



బస్తీలలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆప్కో కాలనీలో మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ఆఫ్కో కాలనీలో వేయ వలసిన సిసి రోడ్లు, బస్తీ దవాఖానా ప్రహరీ గోడ, టాయిలెట్స్ నిర్మాణం, మహిళా సంఘం కమిటి హాల్ నిర్మాణం కోసం అధికారులతో కలిసి ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి కాంట్రాక్టులతో మాట్లాడి అధికారులకు తెలియజేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభం అయ్యే విధంగా చూడాలని ఆయన అధికాలను ఆదేశించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరీస్, సురేష్, రవి కుమార్, స్వామి లక్ష్మణ్, తిరుపతమ్మ, పారిజాతం లక్ష్మి, వెంకటేష్, ఎల్వీ రెడ్డి, కృష్ణారెడ్డి, తలారి చిన్న, పాండు, అనిల్, శంకర్ రెడ్డి. శేఖర్ జోష్వా పాల్గొన్నారు.

## రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారికి ప్లాట్లు ఇవ్వాలని వినతి

**- ప్రభుత్వ పాఠశాలకు 5.ఎకరాల స్థలం కేటాయించాలి**



రేడియల్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారికి ప్లాట్లు ఇవ్వాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యేను కోరుతున్న వట్టినాగులపల్లి కాంగ్రెస్ నాయకులు

**నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలో రేడియల్ నిర్మాణం కోసం ఇళ్లను కోల్పోయిన బాధితులకు ప్లాట్లు ఇవ్వాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను స్థానిక రాజకీయ నాయకులు కోరారు. మంగళవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు శిశుపాల్‌సింగ్ నేతృత్వంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి కలిశారు. ఈ సందర్భంగా శిశుపాల్‌సింగ్ మాట్లాడుతూ వట్టినాగులపల్లిలో ప్రభుత్వ పాఠశాల చాలా ఇరుకుగా మారిందని, 1.నుంచి 10.తరగతుల వరకు పాఠశాల ఉన్నా, సరైన వసతులు లేవన్నారు. భావి భారత పౌరులను నిర్మాణం చేసే పాఠశాలకు 5.ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతున్నామన్నారు. అలాగే సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వట్టినాగులపల్లి వద్ద ఉన్న ఓఆర్ఆర్ జంక్షన్ వరకు వట్టినాగులపల్లి మీదుగా రేడియల్ రోడ్డు వేశారని, ఇందులో భాగంగా చాలా మంది పేదలు ఇళ్లు కోల్పోయరని, వారికి ప్లాట్లు ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. 300. గజాలలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, మేయిన్ రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశామన్నారు. మా వినతిపత్రాన్ని చదివిన వెంటనే ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందిస్తూ రెండు, మూడు రోజుల్లో మీ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీనిచ్చారని శిశుపాల్‌సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, వట్టినాగులపల్లి కాంగ్రెస్ నాయకులు కుమ్మరి శేఖర్, బుదాల అరుణ్ ముదిరాజ్, మేకల లక్ష్మణ్‌రెడ్డి, తారాసింగ్, కుమ్మరి చంద్రయ్య, రాగం సురేష్ యాదవ్, ఎరుల మాణిక్యం, మల్లేష్, యాదగిరి, నర్సిహ్మా, సాయితివారి తదితరులు పాల్గొన్నారు.

## స్థలాలు ఇచ్చేందుకు చొరవ చూపకపోతే సిఎం ఇంటిని ముట్టడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కనకం కొమురెల్లి

**సైఫాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాలను తిరిగి వెనక్కి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. లేని పక్షంలో సిఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని అసోసియేషన్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కనకం కొమురెల్లి, తూము అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం నాలుగు సంఘాల ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాల కోసం గోపన్‌పల్లిలో 427 ఎకరాల భూమిని కేటాయించిందని చెప్పారు. ఇందులో బిటిఎన్జీవోస్, గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటి వాటాగా 189 ఎకరాలు వచ్చిందన్నారు. కాగా గత కెసిఆర్ ప్రభుత్వం అన్యాయంగా తమకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన భూమిని అన్యాయంగా తీసుకుందని వారు ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రిని కలిసి వివరించడం జరిగిందని, మంత్రి సానుకూలంగా స్పందించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. 16 నెలలు గడిచినప్పటికి ఏలాంటి పురోగతి కనిపించలేదని, సిఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం గత 10 నెలలుగా సిఎంఓ కార్యాలయం చుట్టు తిరుగుతన్నప్పటికి అవకాశం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం తక్షణమే తమ సమస్యను పరిష్కారించాలని కోరారు.

### పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ముందుకు రావాలి

**- మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి**



మణికొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లంచ్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం.

**నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరింత మంది ముందుకు రావాలని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మణికొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు ఖాజాగూడకు చెందిన ఒక్రిడ్జ్ విద్యార్థులు ఉచితంగా లంచ్‌బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద బిడ్డలే చదువుతున్నారని, వారి విద్యాభివృద్ధికి ఆర్థికంగా స్థిరపడ్డ వారు సహకారం చేయాలని సూచించారు. ప్రతీఏటా దాతలు, స్వచ్ఛంద సంస్థలతో విద్యార్థులకు కంపాక్స్‌లు, స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, దుస్తులు ఇప్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దశరత్ నాయక్, నాయకులు బుద్దోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, లక్ష్మీశ్రీ, శ్రవణ్, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమ్మర్ క్యాంప్‌లు వల్ల ఎన్నో లాభాలు : డైరెక్టర్ నగరాజు



కార్యక్రమంలో పాల్గొన్న రెయిన్బో హోం డైరెక్టర్ నాగరాజు, ప్రొగ్రాం కన్వీనర్ వి.పర్వతాలు, బాలికలు

**చార్మినార్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రతీ ఒక్కరూ చదువు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని అశ్రిత రెయిన్బో హోం డైరెక్టర్ నాగరాజు అన్నారు. వేసవి కాలం సందర్భంగా మంగళవారం పాతబస్తీ దూద్‌బౌలి మహారాజ్ గంజ్‌లోని రెయిన్బో హోంలో బాలికలుకోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ (2025)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వేసవి సెలవులలో హోంకు చెందిన బాలికలకు సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నామని తెలిపారు. నెల రోజు పాటు కొనసాగనున్న సమ్మర్ క్యాంప్‌లో బాలికలకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కరాటే, కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు అంశాలపై అనువజ్ఞులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలియజేశారు. ప్రొగ్రాం కన్వీనర్ వి.పర్వతాలు మాట్లాడుతూ బాలికలు సమ్మర్ క్యాంప్‌ను అన్ని విధాల సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలలో హోంకు చెందిన పన్నెండు మంది బాలికలు మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కరాటే ఉపాధ్యాయులు దేవ కిరణ్, అశ్విన్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### గాంధీనగర్ డివిజన్‌లో వేగవంతంగా డిసిల్టింగ్ పనులు

**-కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లలో వేగవంతంగా డీసిల్టింగ్ పనులను చేపట్టి పూర్తి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో డిసిల్టింగ్ పనులను పరిశీలించారు. అకాల వర్షాల వల్ల రోడ్లపై వరద నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్న ఫిర్యాదు మేరకు వివిధ ప్రాంతాలలో పర్యటించడం జరిగిందన్నారు. జిహెచ్ఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులతో వరదనీటి సమస్య వివరాలపై సమీక్షించి డివిజన్ లోనీ అన్ని ఏరియాల్లో కచ్చా మోరి పైప్ లైన్‌లలో పేరుకు పోయిన మట్టి, చెత్త చెదారాన్ని తొలగిం చేందుకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆనంద్ రావు, సాయి కుమార్, డి.కుమార్, నీరజ్, ప్రశాంత్.. తదితరులు పాల్గొన్నారు.

### కావ్యారెడ్డి సంగీత సరస్వతి సేవలో తరించడం గర్వకారణం : సినీ హీరో సుమన్



గాయని కావ్యారెడ్డిని సత్కరిస్తున్న సినీ నటులు సుమన్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వృత్తిరీత్యా అధ్యాపకురాలైన కావ్యారెడ్డి, అటు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో పాటు సంగీత సరస్వతి సేవలో తరలించడం గర్వకారణమని ప్రముఖ సినీనటులు సుమన్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో కావ్యరెడ్డి మ్యూజిక్ వరల్డ్ ఆధ్వర్యంలో 'సుశీలమ్మ పాటలతో సుమధర స్వరాభిషేకం-2 కార్యక్రమంలో గానకోకిల పి.సుశీల పాడిన పాటలలో 108కిపైగా పాటలు, పన్నెండు గంటల పాటు నిర్విరామంగా పాడి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మూడింటిలో ప్రముఖ గాయని కావ్యారెడ్డి స్థానం సంపాదించినట్లు నిర్వాహకుడు బి.నరేందర్‌గౌడ్, చింతలపాటి వెంకటాచారి, రవికుమార్ ప్రకటించారు. హీరో సుమన్ మాట్లాడుతఊూ కృషి పట్టుదలకు, ఒక స్త్రీ శక్తికి నిదర్శనమన్నారు. వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు-2025, ఘంటసాల గోల్డ్ మెడల్‌తో కావ్యారెడ్డిని సత్కరించారు. ఇలాంటి అరుదైన ఘనత సాధించిన కావ్యారెడ్డిని పలువురు అభినందనలతో ముంచెత్తారు. కార్యక్రమంలో రమేష్ బ జాజ్, సైదారెడ్డి, డాక్టర్ విజేందర్‌రెడ్డి, గాయనీ గాయకులు పాల్గొన్నారు.

### ఆత్మహత్య చేసుకోబోయిన యువతిని కాపాడిన పోలీసులు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్తః**

అర్ధరాత్రి ట్యాంక్ బండ్‌లో దూకి ఆత్మహత్యకుయత్నం చేయబోయిన ఓ యూవతిని పోలీసులు కాపాడిన సంఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. నిజామాబాద్‌కు చెందిన చంద్రయ్య, విలిసిని రాణి దంపతు లు ఓల్డ్ బోయిన పల్లి మల్లికార్జున కాలనీలో కుమారుడు ఫ్రెడ్రిక్, కూతురు నాన్సీ (25 )లతో కలిసి నివాసం ఉంటు న్నారు, నాన్సీ కొంతకాలంగా అంశుమాన్‌తో ప్రేమలో పడిం ది ఈ విష్యం ఇంట్లో కూడా తెలి పింది. నాన్సీ వివాహానికి సమయం కావాలని కుటుంబ సభ్యులు కాలయాపన చేస్తు న్నారు. దీంతో మస్తాపం చెందిన నాన్సీ సోమ వారం ఆత్మ హత్య చేసుకుంటున్నట్లు తల్లికి ఫోన్‌చేసి చెప్పింది. దీంతో బయాందోళనకు గురైన తల్లి బోయిన్పలి పోలీసులకు ఫి ర్యాదు చేసింది వెంటనే స్పందించిన పోలీసులు ఫోన్ సిగ్నల్ ద్వారా ట్యాంక్‌బండ్‌పై ఉన్నట్లు గుర్తించారు. నాన్సీని అదు పులోకి తీసుకొని బోయిన్పలి పోలీస్ స్టేషన్‌కు తరిలించారు. అంతరం కౌన్సలింగ్ చేసిన పోలీసులు నాన్సీని కుటుంభం సబ్యులకు అప్పగించారు.

## ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్షను విరమిస్తున్న సిద్దేశ్వర్ పటేల్



ఢిల్లీలో సిద్దేశ్వర్ పటేల్‌చే ఆమరణ నిరాహార దీక్ష విరమింపజేస్తున్న సంజయ్‌సింగ్, ఆళ్ల రామకృష్ణ

**సైఫాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం బిసిలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్‌లకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని, దేశ జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ గత 22 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అజాది జెఎసి చైర్మన్ బత్తుల సిద్దేశ్వర్‌పటేల్ మంగళవారం విరామ విరమణ చేశారు. ఓబిసి జాతీయ మేధావుల ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయనకు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సంజయ్‌సింగ్, సూరజ్ మండల్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎఐసిసి ఓబిసి చైర్మన్ అనిల్ జైహింద్, సుప్రీంకోర్టు న్యాయవాది డా.కె.ఎస్. చౌహాన్ తదితరులు పటేల్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి బిల్‌వర్మతో జక్కని సంజయ్ బృందం చర్చలు చేసిన సందర్భంగా మంత్రి దీక్షను విరమించమని కోరారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి జనగణనలో కులగణన చేపట్టాలని, బిసి బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని కోరారు.

## వరంగల్లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

-కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్



నేరెడ్ మెట్, ఏప్రిల్ 22.(ప్రభాతవార్త : ఈనెల 27న వరంగల్లో జరిగే రజితోత్సవ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం గౌతమ్ నగర్ లోని ఆమె కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వరంగల్ లో జరిగే సభకు పార్టీ శ్రేణులు అభిమానులు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రముఖ కవయిత్రి రమాదేవికి ఎక్సలెన్స్ అవార్డు అందజేత



ప్రముఖ కవయిత్రి బుక్కపట్నం రమాదేవిని సన్మానించి ఎక్సలెన్స్ అవార్డును అందజేస్తున్న అంజనీకుమారి తదితరులు

మలక్ పేట ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ప్రముఖ సినీ గేయ రచయిత కవయిత్రి సాహితీవేత్త బుక్కపట్నం రమాదేవికి ఎక్సలెన్స్ అవార్డు ను అందజేశారు. ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు పీవీపీ అంజనీ కుమారి, ఆలూరు విల్సన్, ఇందిరా, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ, గురు స్వామి, రామకృష్ణ, కచంద్రమోళి తదితరుల చేతుల మీదుగా బుక్కా పట్నం రమాదేవికి ఎక్సలెన్స్ 2025 అవార్డును ప్రధానం చేశారు. ఎక్సలెన్స్ అవార్డును తనకు అందజేయడం అభినందనీయమని కవయిత్రి బుక్కపట్నం రమాదేవి పేర్కొన్నారు.

## ఘనంగా లక్ష్మి నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం



శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు.

వనస్థలిపురం. ఏప్రిల్. 22.(ప్రభాతవార్త :
బి.యన్.రెడ్డి. నగర్ డివిజన్ లోని శ్రీకృష్ణదేవరాయ నగర్ లో గల శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఆలయ 13 వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం బి.యన్. రెడ్డి.నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆలయ వేడుకలలో పాల్గొని స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమిరెడ్డి, కాలనీ గౌరవ అధ్యక్షులు బొమ్మ రఘురాం నేత,శంకరయ్య గౌడ్,శ్రీధర్ రావు,కృష్ణారావు, జానకి రామారావు, శ్రీనివాసరావు, రమణ,రూపలాల్,వెంకట్రావు, మహిపాల్ రెడ్డి,పాల్గొన్నారు.

## జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవ వేడుకలు



తలుపు తట్టి మేల్కొలుపుదాం కార్యక్రమంలో భావన శ్రీనివాసరావు తదితరులు.

వనస్థలిపురం. ఏప్రిల్. 22.ప్రభాతవార్త. జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 22 ధరిత్రి దినోత్సవం సందర్భంగా భూమిని కాపాడుదాం,భూమి ఫైన ఉన్న చెట్టును కాపాడుదాం, చెట్టును ఆధారంగా చేసుకున్న పక్షులను కాపాడుదాం అనే నినాదంతో శ్రీ వెంకటేశ్వర కాలనీలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాసరావు ,సంఘం సభ్యులు, విద్యార్థులు గడప గడపకు వెళ్లి తలుపు తట్టి మేల్కొలుపుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక్కసారి వాడి పారేసిన ప్లాస్టిక్ వల్ల భూమాతకు కల్గెటువంటి నష్టాలను వివరిస్తూ ,వాటి స్థానంలో అందుబాటులో ఉండే ప్రత్యమ్నాయ వస్తువులను ప్రదర్శించడం జరిగింది. అదే విదంగా ప్రస్తుత తరుణంలో పలుచపడుపోతున్న ఓజోన్ పొర,రాక రకాల కాన్సర్ కారక ఆహార పదార్థాలు, వ్యవసాయ రంగంలో వాడుతున్న రసాయనాలు,సెల్ఫోన్ రేడియేషన్, నీటిని అధికంగా వాడటం,భూగర్భ జలాలు అడుగంటిపోవడం,విద్యుత్, పెట్రోల్ లాంటి వనరుల దుర్వినియోగం తదితర అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ భావన శ్రీనివాసరావు, యోగ గురూజీ ఇస్మాయిల్, సంధ్యారాణి, శ్రీ వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు పి.కృష్ణ, శిరీష ,నరేందర్ గురూజీ,యాదా రామలింగేశ్వర రావు,జాగృతి వారియర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు కొత్తపేటలో మేధావులతో సదస్సు



వరంగల్లో జరుగుతున్న బిఆర్ఎస్ బహిరంగ సభ ఏర్పాటు పరిశీలిస్తున్న చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తపేట లోని స్ప్రైసి హబ్ హోటల్లో మేధావుల సదస్సు (సెమినార్) నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా రూరల్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కన్వీనర్ పిట్ట ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి, బిజెపి జాతీయ సీనియర్ నాయకులు పేరాల శేఖర్‌జీ, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్‌గౌడ్ హాజరై ప్రసంగం చేస్తారని తెలిపారు. కావున సదస్సుకు మేధావులు, బిజెపి రాష్ట్ర జిల్లా నాయకులు, వివిధ మండల, డివిజన్, మున్సిపల్ అధ్యక్షులు, వివిధ మోర్చా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

# రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్న కాంగ్రెస్ : దేప భాస్కర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:
జైభీమ్ జైబాబు జైసంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జైభీమ్ జైబాబు జైసంవిధాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జైభీమ్ జైబాబు జైసంవిధాన్ కోఆర్డినేటర్ భార్గవ్‌రామ్‌తో కలిసి సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోడీ ప్రభుత్వం విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ భారత్ జోడయాత్ర ద్వారా దేశ ప్రజలను సమనత్వంతో చైతన్యవంతం చేశారన్నారు. 11 ఏళ్లగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం బిజెపి చేస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వాక్యాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలని గౌరవిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్‌రావు, సురేష్, శ్రీప్రసన్నాంజనేయ ఆలయ చైర్మన్ తలాటి రమేష్‌నేత, జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, సుజాతరెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, రాజునాయక్, ప్రేమ్‌నాయక్, కళ్యాణ్‌యాదవ్, లింగస్వామిగౌడ్, అలేటి కిరణ్, పెద్దవూర సైదులు, మహమ్మద్, హరి, రఫీ, రేణుక, సుజాతరెడ్డి, మాధవి,మమత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.




యాత్రలో పాల్గొన్న భాస్కర్‌రెడ్డి, గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

# హబ్సిగూడలో కాంగ్రెస్ నేతల రాజ్యంగ పరిరక్షణ ర్యాలీ

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :
హబ్సిగూడ డివిజన్ పరిధిలోని సాయిరాం స్కూల్, నవరంగ్‌గూడ, శ్రీనివాసపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ కోఆర్డినేటర్ పి.ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కంది శ్రవణ్‌రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ సుధాకర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డా.బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని, యువ వికాసం వంటి పథకాలు నిరుద్యోగులకు వరంగా మారాయన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మురళీకృష్ణ, శ్రీనివాసాచారి, భాను, మాలు నాయక్, రాజునాయక్, వాసునాయక్, సంపత్, సురేష్, రఘు, సీదులు, జహంగీర్, శ్రీధర్, మట్ట అంజయ్య, సోమయ్య, రవికుమార్, షబ్బీర్, లక్ష్మినారాయణ, అనిత,శివకాంత్,శిరీష, భాస్కర్, రాజేష్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.




హబ్సిగూడలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేతలు

# బిఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : వరంగల్‌లో ఈనెల 27న జరిగే బిఆర్ఎస్ పార్టీ అవిర్భావ, రజత్సోతవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉప్పల్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌కు చెందిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేకతను వరంగల్ సభలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి పాలన అన్ని రంగాల్లో విఫలం అయ్యిందన్నారు. హైడ్రా పేరుతో పేదల జీవితాలను నాశనం చేశారని, భూముల అమ్మకాల ద్వారా ప్రభుత్వ స్థలాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ సగం మందికే చేశారని, మిగిలిన వారికి ఇంత వరకు రుణమాఫీ చేయలేదన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని డివిజన్‌ల నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ పార్టీ నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్ ఏప్రిల్ 22 (ప్రభాతవార్త)
తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ ప్రభుత్వ పాఠశాల అన్ని పాఠశాలలకు ఆదర్శం కావాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే కు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య తక్కువ ఉండడంతో అధికారులతో మాట్లాడి త్వరలోనే ఉపాధ్యాయులను భర్తీ చేస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులను పెంచేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జగదీశ్వర్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ, మాజీ కౌన్సిలర్ కోశిక ఐలయ్య, నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, సామ భీమ్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, పూజారి శంకరయ్య, రేవల్ల యాదగిరి, నారని శేఖర్ గౌడ్, ఒరుసు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## స్వర్గీయ ఇంద్రారెడ్డికి మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ నేతల నివాళి



సబితా ఇంద్రారెడ్డితో కలిసి స్వర్గీయ ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ నేతలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, తెలంగాణ మలిదశ ఉద్యమ నేత స్వర్గీయ పట్లోళ్ళ ఇంద్రారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి స్వగ్రామమైన కౌకుంట్లకు కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల బీరప్ప, జె.శ్రీనివాస్ నాయక్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాలరాజ్, జమాల్‌పూర్ సునీత, సుర్వి లత శేఖర్‌గౌడ్ తదితరులు తరలివెళ్ళారు. అక్కడ వారు ఇంద్రారెడ్డి సతీమణి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఇంద్రారెడ్డి సమాధి వద్ద ఘన నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ సబితారెడ్డి నాయకత్వంలో ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం కృషి జరుగుతున్నదని తెలిపారు.

## టన్నెల్ ప్రమాదం నుండి బయటపడిన అల్లావుద్దీన్‌కు నర్సింహారెడ్డి సన్మానం



అల్లావుద్దీన్‌ను సన్మానిస్తున్న చిగిరింత నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదంలో సురక్షితంగా బయటపడిన దేవరకొండ మున్సిపాలిటీ కో-ఆప్షన్ మెంబర్ తయ్యబా ఫాతిమ భర్త అల్లావుద్దీన్‌ను మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రమాదం నుండి సురక్షితంగా బయట పడినందుకు ఆయను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసదుద్దీన్, మహ్మద్ రియాజ్, నాసిర్, మహ్మద్ ఒమర్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాసరి బాబు, యాదగిరి చారి తదితరులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: వచ్చే నెల మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మూడువ సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలో సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు నాయకులు శేఖర్ యాదవ్, దాసరి బాబు, నర్సింహ, యాదగిరి చారి, మల్లికార్జున్, నర్సింగ్‌రావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి : బద్దం



వినతిపత్రం అందజేస్తున్న ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: డివిజన్లో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చదివించే పట్టాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గడ్డిఅన్నారం డివిజన్‌లోని వివిధ కాలనీలలో ఉన్న పెండింగ్ పండ్లను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సరూర్‌నగర్ ఈఈ శ్రీనివాసును కలిసి కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులు పూర్తి కాకపోవడం వల్ల కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మంచినీటి సమస్య గురించి జలమండలి అధికారులతో కార్పొరేటర్ చర్చించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏ సాయి, యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాంకీ భారత్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బహిరంగసభ పోస్టర్ విష్కరణ




బిఆర్ఎస్ పార్టీ బహిరంగసభ పోస్టర్ అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పిల్లి నాగరాజు తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : వరంగల్‌లో ఈనెల 27న జరిగే బిఆర్ఎస్ పార్టీ బహిరంగసభ పోస్టర్‌ను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అవిష్కరించారు. ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగసభ పోస్టర్ అవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ సభకు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు అరటికాయల భాస్కర్, అన్య బాలకృష్ణ, మేకల మధుసూధన్‌రెడ్డి, బి.నిరంజన్‌చారి, కోండ్రు హనుమంతు,వేముల సంతోష్‌రెడ్డి, రంగ భాస్కర్‌గౌడ్, గడ్డం పాపిరెడ్డి, పంగ మహేందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులు




ర్యాంకర్లను సన్మానించిన ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:
ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో బాలాపూర్ చౌరస్తాలోని వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. వెలువడిన ఇంటర్ జూనియర్, సీనియర్ ఫలితాల్లో ఈ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పలు ర్యాంకులను సాధించారు. ఎంపిసి, బైపిసి, సిఇసి విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ఐదు ర్యాంకుల లోపు ఈ కాలేజీ విద్యార్థులు ర్యాంకుల సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో కె.సౌమ్య 1000 మార్కులకు గాను 993 మార్కులు, ఎంపిసిలో అద్వైత్, రతన్ అనే విద్యార్థులు 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించడం విశేషం. కాగా ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులను కాలేజీ ఛైర్మన్ సిద్దాల లార్డ్స్ బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పోలోజు రవికుమార్, తిప్పర్తి నర్సింహారెడ్డిలు అభినందించారు. అదే విధంగా విద్యార్థులకు ర్యాంకులు రావడానికి కృషి చేసిన అధ్యాపకులను కూడా వారు ప్రశంసించారు.

## అర్హులను ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులుగా ఎంపిక చేయాలి : బిజెపి



లబ్ధిదారుల పరిశీలన జరుపుతున్న అధికారులు, సిబ్బందితో పసునూరి బిక్షపతిచారి

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:
మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అర్హులనే ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు, 27వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి డిమాండ్ చేశారు. డివిజన్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, రాష్ట్ర ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ళ పథకాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై లబ్ధిదారుల పరిశీలన జరిపారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకాధికారి దుర్గ, వార్డు ఆఫీసర్ సాయికిరణ్ తదితరులతో కలిసి డివిజన్‌లో జరిగిన విచారణలో బిక్షపతిచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంక్వైరీల పేరిట కాలయాపన చేయకుండా అసలైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. లేని పక్షంలో బిజెపి తరపున ప్రజల్లోకి వెళ్ళి వివరిస్తామనిన ఆయన స్పష్టం చేశారు.

## వాజ్‌పేయి, మోడీ స్ఫూర్తితో ముందుకు సాగాలి:బోల్గం



జెండా ఆవిష్కరిస్తున్న యష్పాల్‌గౌడ్

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: అటల్ బిహారీ వాజ్‌పాయ్, ప్రధాని నరేంద్రమోడీ స్ఫూర్తితో బిజెపి ముందుకు సాగుతోందని బిజెపి సీనియర్ నాయకుడు బోల్గం యశ్పాల్‌గౌడ్ పేర్కొన్నారు. అటల్ బీహారీ వాజ్‌పాయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గావ్‌చలో బస్తీచలో కార్యక్రమం బోల్గం యష్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట గ్రామంలో నిర్వహించారు. కొత్తపేట గ్రామంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం శుభ్రం చేశారు. కొత్తపేటలో ర్యాలీగా తరలి వెళ్లి బిజెపి పార్టీ జెండా ఆవిష్కరించారు. వాజ్‌పాయ్ హయాంలో ఉన్న పార్టీ కార్యకర్తలు గొల్లపల్లి భాస్కర్‌గౌడ్, రాజేందర్,ముఖేష్‌గౌడ్‌లను శాలువాలతో సత్కరించారు. బిజెపి కార్యకర్త బద్రి అశోక్‌గౌడ్ నివాసంలో సహపంక్తి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చ కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, రాచకొండ రాధిక, భాస్కర్, రాజేందర్, బద్రి అశోక్, కాటసత్యనారాయణగౌడ్, యువ మోర్చా అధ్యక్షులు ప్రసాదం కిరణ్, వినోద్, సంప్రీత్, రాజు, తరుణ్, వెంకట్, విష్ణు, యశ్వంత్, పవన్, సంధ్య, మాధవి, లక్ష్మమ్మ, ఝాన్సీ, రాణి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో కార్పొరేటర్ ప్రత్యేక పూజలు



పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:
కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీలోని శ్రీహరిహరక్షేత్ర దేవాలయంలో జరుగుతున్న 13వ వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో మంగళవారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉత్సవమూర్తులకు పంచామృత విశేషా మంగళ ద్రవ్యాభిషేకాలు, చండిసప్తశతి హోమములు, మంగళ దేవత హోమములు తది తర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం స్వర్గీయ ఇంద్రారెడ్డి పోరాటం

-రాజేంద్రనగర్ బిఆర్ఎస్ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



అత్తాపూర్ ఏప్రిల్ 22, ప్రభాతవార్త
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మన నాయకుడు స్వర్గీయ ఇంద్రారెడ్డి అని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంచార్జీ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. స్వర్గీయ ఇంద్రారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా మంగవారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని డైరీఫామ్ దగ్గర జరిగిన కార్యక్రమానికి కార్తీక్ రెడ్డి హాజరై రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్,బిఆర్ఎస్ నేత ధర్మారెడ్డిలతో కలిసి ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.... ప్రజల కోసం నిరంతరం ఉద్యమం చేసిన వీరుడు స్వర్గీయ ఇంద్రారెడ్డిని ప్రజలు మరువలేదని అన్నారు. పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రజల్లో చెవరగని ముద్రవేసుకున్నారన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాంతం అభివృద్ధికి స్వర్గీయ ఇంద్రారెడ్డి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.